# అడవిపై ఆర్థిక దోపిడీ!

## అటవీ చట్టాల ఉల్లంఘన, అక్రమాలపై విచారించాలి

## అప్పటివరకు తాకట్టు, వేలంపై స్టే విధించాలి

- 'మార్గదర్శకాల'ను కాదని విధ్వంసం
- మినహాయింపు మాటున చెట్ల నరికివేత
- నిరసనలు ఆపేందుకు పోలీసు ఆపరేషన్
- వర్సిటీ భూముల్లో అరుదైన జీవవైవిధ్యం
- రికార్డుల ప్రకారం ఆ 400 ఎకరాలు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీవే
- టీజీఐఐసీకి యాజమాన్య హక్కులే లేవ్
- సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో కేంద్ర సాధికార కమిటీ స్పష్టీకరణ
- తుది నివేదిక సమర్పించేదుకు 4 వారాల గడువు కోరిన సాధికార కమిటీ



హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సిద్ధాంతదాస్ నేతృత్వంలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తున్న కేంద్ర సాధికార కమిటీ (ఫైల్‌ఫొటో)

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): టీజీఐఐసీ ద్వారా తాకట్టు, వేలం తదితర ప్రక్రియలతో హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూములు వ్యాపార, ఆర్థిక దోపిడీకి గురవుతున్నందున వెంటనే ఆ ప్రక్రియలపై స్టే విధించాలని దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) కోరింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చి, పర్యావరణ విధ్వంసానికి పాల్పడ్డారని, చట్టాలను ఉల్లంఘించారని పేర్కొన్నది. ఉద్దేశపూర్వకంగానే పర్యావరణ అనుమతులు కాకుండా కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు తీసుకొని, మినహాయింపు ఉన్న చెట్ల పేరిట అన్నిరకాల చెట్లను బుల్డోజర్లతో నేలమట్టం చేశారని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశానుసారం ఈ నెల 10న హైదరాబాద్‌కు వచ్చిన సిద్ధాంత దాస్ నేతృత్వంలోని సాధికార కమిటీ హెచ్‌సీయూలోని భూములు, చెట్ల నరికివేతను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. విద్యార్థులు, పర్యావరణవేత్తలు, బీఆర్‌ఎస్ నేతల నుంచి వివరాలు సేకరించింది. పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించింది. పర్యటనలో సేకరించిన అంశాల మేరకు కమిటీ సుప్రీంకోర్టుకు మంగళవారం నివేదికను సమర్పించింది. ప్రధానంగా వర్సిటీ భూముల్లో టీజీఐఐసీ ఆధ్వర్యంలో వందలాది బుల్డోజర్లతో జరిగిన పర్యావరణ విధ్వంసం, చట్టాల ఉల్లంఘన, దాని వెనుక కుట్రలను సీఈసీ నివేదికలో వివరించింది. రికార్డులను పరిశీలిస్తే 400 ఎకరాల భూములు హైదరాబాద్ వర్సిటీకే చెందినవిగా కనిపిస్తున్నదని కీలకమైన అంశాన్ని పొందుపరిచింది. ఇంతటి విధ్వంసానికి పాల్పడిన టీజీఐఐసీకి అసలు పూర్తిస్థాయిలో భూ యాజమాన్యహక్కులే లేవని తేల్చిచెప్పింది. ఈ మేరకు 69 పేజీల నివేదిక సమర్పించింది.

### సుప్రీంకోర్టు జోక్యం.. కమిటీ నివేదక

హెచ్‌సీయూ చెందిన భూముల్లో పెద్ద ఎత్తున చెట్ల నరికివేతతో పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్నారంటూ మీడియాలో కథనాలు వచ్చాయి. వరుస సెలవు దినాలను ఆసరాగా చేసుకొని ఈ విధ్వంసానికి పాల్పడుతున్నారని వచ్చిన కథనాలను అమికస్ క్యూరీ పరమేశ్వర్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గత నెల 30న మొదలైన చెట్ల నరికివేత 4రోజుల పాటు కొనసాగింది. హైకోర్టు స్టే విధించినా పనులు ఆగలేదు. జోక్యం చేసుకున్న సుప్రీంకోర్టు.. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి వెంటనే నివేదిక ఇవ్వాల్సిందిగా ఈ నెల 3న హైకోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. అనంతరం రిజిస్ట్రార్ నివేదికను పరిశీలించిన సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో పాటు సాధికార కమిటీని క్షేత్రస్థాయి పరిశీలనకు పంపింది. సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు అమికస్ క్యూరీతో రిట్ పిటిషన్ వేయించింది.

### ఉల్లంఘనలపై తూర్పారబట్టిన కమిటీ

సాధికార కమిటీ తన నివేదికలో భాగంగా పరిశీలనల 'ముగింపు (కన్‌క్లూజన్)'లో పొందుపరిచింది. ఇందులో ప్రధానంగా చట్టాల ఉల్లంఘన ఎలా జరిగిందో తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం.. టీజీఐఐసీ తీరును తూర్పారబట్టింది. 'అడవిని తలపిస్తున్న ఈ ప్రాంతంలో టీజీఐఐసీ అనవసరమైన తొందరపాటు చర్యలు చేపట్టింది. అడవిలా ఉన్న ప్రాంతాలు కూడా అటవీ చట్టం-2023లోని సెక్షన్ 1ఏ కిందకు వస్తాయని, ఆ ప్రాంతాలను అటవీయేతర అవసరాలకు మార్చడం, పచ్చదనాన్ని తొలగించడం సరికాదని 4.3.2025న అశోక్‌కుమార్ శర్మ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. కానీ తెలంగాణ ప్రభుత్వం ఈ ఆదేశాలను పాటించలేదు. టీజీఐఐసీ 'వృక్షాల తొలగింపు'నకు టెండర్లు పిలిచి ఆ పనిని డెల్టా గ్లోబల్ సర్వీసెస్‌కు అప్పగించింది. ఈ మేరకు సదరు సంస్థ భారీ యంత్రాలతో వృక్షాలు, మొక్కలను నరికివేసింది. భారీ యంత్రాలతో యుద్ధప్రాతిపదికన చెట్ల నరికివేత చేపట్టారు. పర్యావరణవేత్తలు, విద్యార్థులు, ఇతరుల నుంచి వచ్చే నిరసనలు అవరోధం కాకుండా ఉండటంతో పాటు న్యాయపరమైన ప్రక్రియలన్నింటినీ ఉల్లంఘించేందుకు పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించి రేయింబవళ్లు (రౌండ్‌ది క్లాక్) పనులు చేసినట్టుగా ఇక్కడి పరిస్థితులు బట్టి తెలుస్తున్నది. వాస్తవానికి ప్రజా ప్రయోజన కోణంలో ప్రజల భాగస్వామ్యంతో జరగాల్సిన ఈ ప్రక్రియను న్యాయపరమైన చర్యలు చేపట్టకుండా రహస్యంగా, బలవంతంగా పోలీసు బల ప్రయోగంతో చేశారు. ఇది ముమ్మాటికీ సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించడమే. సుప్రీంకోర్టు వెంటనే ఈ చర్యలపై దృష్టిసారించాలి' అని నివేదికలో పేర్కొన్నది.

> అడవులను పోలిన ప్రాంతాల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చి పర్యావరణ విధ్వంసానికి పాల్పడ్డారు. ఈ క్రమంలో చట్టాలను కూడా ఉల్లంఘించారు. ఉద్దేశపూర్వకంగానే పర్యావరణ అనుమతులు తీసుకోవద్దని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి సీఎఫ్ఈ (కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్) అనుమతి తీసుకున్నారు. మినహాయింపు ఉన్న చెట్ల మాటున అన్నిరకాల చెట్లను బుల్డోజర్లతో నేలమట్టం చేశారు.
>
> -హెచ్‌సీయూ భూముల విషయంలో సుప్రీంకోర్టుకు ఇచ్చిన నివేదికలో కేంద్రసాధికార కమిటీ

### టీజీఐఐసీ యాజమాన్య హక్కు వివాదాస్పదమే!

అపారమైన పర్యావరణ, విద్య, ఆర్థిక విలువలున్న ఈ భూములు యూనివర్సిటీ పరిధిలోనే ఉన్నాయని, ఇక్కడ అరుదైన శిలా నిర్మాణం, సహజసిద్ధమైన నీటి వనరులు, జీవ వైవిధ్యం ఉన్నాయని సీఈసీ నివేదికలో స్పష్టం చేసింది. 'ఇక్కడ కబ్జాలు కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. భారీ యంత్రాలతో పచ్చదనాన్ని తొలగించిన ప్రాంతం ఎంతో సహజసిద్ధమైన అడవిని పోలి ఉంటుందని అర్థమవుతుంది. కానీ అలాంటి అటవీ ప్రాంతాన్ని కాపాడకుండా పర్యావరణ, అటవీ చట్టాలను ఉల్లంఘించిమరీ చెట్లను నరికివేశారు. ముఖ్యంగా ఈ 400 ఎకరాలు తమదేనంటున్న టీజీఐఐసీకి ఇంకా పూర్తిగా యాజమాన్య హక్కులు రాలేదు. చారిత్రక రికార్డులు, న్యాయ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలిస్తే ఒప్పందం ప్రకారం ఈ భూములు సెంట్రల్ యూనివర్సిటీకే చెందుతాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ఈ భూముల్లో విద్యాయేతర అవసరాలకు వినియోగించడాన్ని నివారించాలి. అందుకే టీజీఐఐసీకి యాజమాన్య హక్కు అనేది న్యాయపరంగా వివాదాస్పదమే అయినందున ఈ అంశాన్ని పరిశీలించాల్సిన అవసరమున్నది. ఇలాంటి వివాదాస్పదమైన భూములను తాకట్టు పెట్టడాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఈ తరుణంలో భూములను మూడో వ్యక్తి ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టినట్టయితే అది ప్రజల ఆస్తులను ప్రమాదంలోకి నెట్టినట్టే అవుతుంది' అని సీఈసీ అభిప్రాయపడింది.

### వివిధ మార్గాల్లో సీఈసీ సమాచార సేకరణ

సుప్రీంకోర్టు ఆదేశాలతో రంగంలోకి దిగిన సీఈసీ వివిధ రూపాల్లో సమాచారాన్ని సేకరించింది. ప్రశ్నావళిని రూపొందించి ఈ-మెయిల్స్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, సైబరాబాద్ సీపీ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, డీఎఫ్‌వో, ఇతర అధికారులకు పంపింది. క్షేత్రస్థాయికి వెళ్లి అక్కడి పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని ఈ నెల 4న సూచించింది. ఆ మేరకు వంద ఎకరాల్లో చెట్ల నరికివేత జరిగిందంటూ పలు అంశాలపై నివేదిక ఇచ్చింది. చెట్ల నరికివేతపై రెండు ఫొటోలు కూడా జతచేసింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ సీపీ కూడా సీఈసీ ప్రశ్నావళిపై తమ సమాధానాలు పంపారు. ఇంకా పలు డాక్యుమెంట్లు కూడా అధికారుల నుంచి రావాల్సి ఉన్నదని సీఈసీ తన నివేదికలో స్పష్టం చేసింది.

### సమగ్ర విచారణకు ఆదేశించండి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి కేటాయించిన రూ.2,374.02 ఎకరాల భూమి రికార్డుల్లో 'కంచ అస్తాబల్ పోరంబోకు సర్కారీ'గా నమోదై ఉన్నదని నివేదికలో పేర్కొన్న సీఈసీ.. ప్రస్తుతం వివాదానికి కేంద్రమైన భూములు అడవికి ఉండే అన్నిరకాల లక్షణాలను కలిగి ఉన్నాయని స్పష్టం చేసింది. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ఈ భూముల్లో చెట్ల సాంద్రత లెక్కింపు ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత సాధికార కమిటీ తుది సిఫార్సులను కోర్టుకు సమర్పించనున్నదని తెలిపింది. ప్రస్తుతం ఇస్తున్న నివేదికలో అత్యంత కీలకమైన సిఫార్సులను చేసిన కమిటీ.. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పలువురు అధికారుల నుంచి అనేక రకాల డాక్యుమెంట్లు కమిటీకి అందాల్సి ఉన్నదని తెలిపింది. చెట్లు నరికివేసిన ప్రాంతంతో పాటు మిగిలిన భూములను కూడా అటవీ ప్రాంతంగా గుర్తించడం, చెట్ల నరికివేతకు సంబంధించి విధి నిర్వహణలో వైఫల్యం చెందిన అధికారుల వివరాలతో తుది నివేదికను సమర్పించనున్నట్టు చెప్పింది. ఇందుకు నాలుగు వారాల గడువు కావాలని సుప్రీం కోర్టును కోరింది. కాగా తాజా నివేదికలో సుప్రీంకోర్టుకు సెంట్రల్ సాధికార కమిటీ చేసిన సిఫార్సులు ఇవి..

- సుప్రీంకోర్టు తదుపరి ఉత్తర్వుల వరకు ఈ భూముల్లో ఎలాంటి చర్యలు చేపట్టవద్దు.
- కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు అడవిని తలపించేలా ఉన్న ప్రాంతాలను గుర్తించేందుకుగాను అటవీ శాఖ, వన్యప్రాణి సంరక్షణ విభాగం అధికారులు, నిపుణులు, పర్యావరణవేత్తలు, ఐటీ, రిమోట్ సెన్సింగ్ ప్రొఫెషనల్స్, సర్వే ఏజెన్సీలతో కూడిన నిపుణుల కమిటీని పునరుద్ధరించాలి.
- అటవీ చట్టం-2023 లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు వేర్వేరు ప్రమాణాలను పొందుపరిచి, పర్యావరణపరంగా వర్గీకరణలు చేయాలి.
- పర్యావరణ ప్రభావిత మదింపు నోటిఫికేషన్-2006 కింద ముందుగా పర్యావరణ అనుమతులు తీసుకోకుండా ఉండేందుకే టీజీఐఐసీ ఉద్దేశపూర్వకంగా కాలుష్య నివారణ, నియంత్రణ చట్టాలు-1981, 1974 కింద సీఎఫ్ఈ (కాన్సెంట్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) కోసం దరఖాస్తు చేసింది. పర్యావరణ ప్రభావిత మదింపు (ఈఐఏ), పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (ఈఎంపీ) రూపొందించకుండా ఉండేందుకే టీజీఐఐసీ భూములను పార్సిల్స్‌గా (ముక్కలుగా) చేస్తున్నట్టు కనిపిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై విచారణ చేయాలి. సదరు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. 30.01.2025న టీజీఐఐసీ దరఖాస్తు మేరకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన సీఎఫ్ఈ అనుమతులను వెంటనే రద్దు చేయాలి.
- ఈ భూముల్లో ఉన్న అరుదైన, విలువైన జీవ వైవిధ్యం, వన్యప్రాణులు, పర్యావరణహితమైన నీటి వనరులను పరిరక్షించేందుకు సుప్రీంకోర్టు సెంట్రల్ యూనివర్సిటీ భూములను 'పర్యావరణ సున్నితమైన జోన్ (ఎకలాజికల్లీ సెన్సిటివ్ జోన్)'గా గుర్తించాలి. తద్వారా భారతీయ వన్యప్రాణి సంస్థ ఈ భూములను పర్యావరణహితంగా మరింత అభివృద్ధి చేసేందుకు సమగ్ర పర్యావరణ అంచనా వేసి చర్యలు చేపట్టేవరకు పర్యావరణాన్ని దెబ్బతీసే చర్యలను ఇక ముందు నివారించినట్టవుతుంది.
- సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో పర్యావరణ విధ్వంసానికి పాల్పడేందుకు 13ఏ ధ్రువీకరణ ఇవ్వడంతో పాటు మినహాయింపు ఉన్న, మినహాయింపు లేని వృక్షాలను సైతం పెద్ద ఎత్తున నేలమట్టం చేసేందుకు డెల్టా గ్లోబల్ సర్వీసెస్‌కు బాధ్యతలు అప్పగించిన టీజీఐఐసీ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విధ్వంసానికి పాల్పడిన యంత్రాలను కూడా జప్తు చేయాలి.
- ప్రాథమికంగా చూస్తే ఈ భూములు సెంట్రల్ వర్సిటీకి చెందినట్టుగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో భూ యాజమాన్య హక్కులను నిర్ధారించేందుకు పాలనాపరమైన సమీక్ష నిర్వహించాలి. అందులో హైదరాబాద్ యూనివర్సిటీతో జరిగిన ఒప్పందంలోని షరతులు, టీజీఐఐసీ వాదనలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి.
- సుప్రీంకోర్టు ఈ భూముల యాజమాన్య హక్కులపై నిర్ణయం తీసుకునే వరకు భూముల తాకట్టు, లీజు, వేలంతో పాటు టీజీఐఐసీ ద్వారా వాణిజ్య పరంగా భూమిని అభివృద్ధి చేయడం వంటి కార్యకలాపాలపై కోర్టు స్టే విధించాలి. తద్వారా తదుపరి ఆర్థిక, న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా ఉంటాయి.
- రానున్న ఏడాది కాలంలో యూనివర్సిటీ క్యాంపస్ బయట తగిన విధంగా మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి, క్యాంపస్‌లో నుంచి మురుగు ప్రవహించకుండా జీహెచ్‌ఎంసీ వెంటనే చర్యలు చేపట్టాలి.
- ఈ వ్యవహారంలో జరిగిన తీవ్ర ఉల్లంఘనలు, ఆర్థికపరమైన అక్రమాల దృష్ట్యా స్వయం ప్రతిపత్తి ఉన్న ప్రత్యేక ఏజెన్సీతో విచారణకు ఆదేశించాలి. ఇందులో భాగంగా భూ యాజమాన్య హక్కులు, మూడో వ్యక్తి (థర్డ్ పార్టీ)కి హక్కుల బదలాయింపు, టీజీఐఐసీ అధికారుల పాత్ర, ప్రభుత్వ భూములను ప్రైవేటుకు ఇవ్వడంలో అక్రమాల సాధ్యాసాధ్యాలపైనా విచారణ చేపట్టాలి.

### చెట్ల నరికివేతతో విధ్వంసమే


ఈ నెల 10న హైదరాబాద్‌కు వచ్చిన సీఈసీ రాష్ట్ర అధికార యంత్రాంగంతో కలిసి హెచ్‌సీయూకు వెళ్లినట్టు నివేదికలో పేర్కొన్నది. ఆ సమయంలో 400 ఎకరాలను స్వాధీనం చేసుకున్న టీజీఐఐసీ మొదటి దశలో భాగంగా 122 ఎకరాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించిందని, అందులో భాగంగానే భారీ యంత్రాలతో చెట్ల నరికివేతకు పాల్పడిందని వెల్లడించింది. అటవీ శాఖ పీసీసీఎఫ్ చెప్పిన మేరకు.. వాల్టా చట్టం ప్రకారం అనుమతులు తీసుకొని చెట్ల నరికివేత చేపట్టారని, అందుకు తీసుకున్న చర్యలను వివరించినట్టు సీఈసీ తన నివేదికలో పొందుపరిచింది. కాగా చిలుకూరు ఎఫ్ఆర్‌వో ఈ నెల 3న ఆ ప్రదేశాన్ని పరిశీలించగా.. మినహాయింపులేని 125 రకాల చెట్లను నరికివేసినట్టుగా గుర్తించారని, ఈ మేరకు కేసు నమోదు చేశారని పీసీసీఎఫ్ చెప్పినట్టు తెలిపింది. అటవీ శాఖ అధికారుల రికార్డుల ప్రకారం 1524 చెట్లు నరికివేయగా.. వాటిలో 1399 మినహాయింపు క్యాటగిరీలో ఉన్నాయని, ఈ క్రమంలో అధికారులు మూడు జేసీబీలను కూడా సీజ్ చేసినట్టు చెప్పారని వెల్లడించింది. టీజీఐఐసీ డెల్టా గ్లోబల్ సర్వీసెస్ ద్వారా భారీ ఎత్తున చెట్ల నరికివేతకు పాల్పడినట్టుగా తాము గుర్తించినట్టు కమిటీ నివేదికలో చెప్పింది. ఈ భూముల్లోంచి మురుగునీరు ప్రవహిస్తూ అందులో ఉన్న చెరువుల్లో కలుస్తుందని, ఆ చెరువుల వద్ద పక్షులను కూడా తాము చూసి, ఫొటోలు తీసినట్టు పేర్కొన్నది.

- అదేరోజు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పలు శాఖల అధికారులు, యూనివర్సిటీ రిజిస్ట్రార్‌తో సమావేశమై ఈ అంశంపై చర్చించినట్టు వెల్లడించింది.
- చాన్స్‌లర్, పాట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డితో కూడిన సెంట్రల్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం వచ్చి తమను కలిసిందని, ఈ సందర్భంగా జస్టిస్ నర్సింహారెడ్డి నివేదిక ఇవ్వగా, రిజిస్ట్రార్ లేఖ ఇచ్చినట్టు పేర్కొన్నది.
- వీరితో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, పలువురు ప్రజాప్రతినిధులు, యూనివర్సిటీ విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులతో తాము మాట్లాడి, నివేదికలు తీసుకున్నట్టు వెల్లడించింది.
- వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్-యూవోహెచ్ ఈ భూములపై చేసిన అధ్యయన నివేదికను కూడా పరిశీలించామని, అందులోని పలు వివరాలను నివేదికలో పొందుపరిచింది.
- ఈ నెల 13న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించారని, అందులో ఈ భూముల వివరాలను పొందుపరచడంతో పాటు పెద్ద ఎత్తున చెట్లు పెరిగి, నెమళ్లు, జింకలు ఉన్నాయని కూడా పేర్కొన్నట్టు నివేదికలో వెల్లడించింది. ముఖ్యంగా సీఎస్ అఫిడవిట్‌లో భాగంగా ఈ భూముల్లో పీకాక్ లేక్, గున్నేరుకుంట, గుంట్ల కుంట, చిలుకల కుంట ఉన్నాయని, వీటిలో మూడు నీటి వనరులు సదరు 400 ఎకరాల పరిధిలో లేవని తెలిపింది.
- టీజీఐఐసీ ఈ భూమిని ఎలా అభివృద్ధి చేయాలనుకున్నది? అందుకు తీసుకున్న చర్యలు, చట్టాల ఉల్లంఘన వివరాలను నివేదికలో పొందుపరిచింది.
- 400 ఎకరాలను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల నిధులను బాండ్ల ద్వారా సమీకరించడం, అందుకుగాను భూ యాజమాన్య హక్కులను బదలాయించడం వరకు అన్ని రకాల పరిణామాలను పొందుపరిచింది.

## ఇది పర్యావరణానికే గొడ్డలి పెట్టు

**కంచ** గచ్చిబౌలి భూములు అత్యంత విలువైనవని, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు ఆనుకొని వర్సిటీకి చెందిన ఈ భూములను ముక్కలు చేసి తద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు చాలా ప్రయత్నాలు జరిగినట్టుగా సీఈసీ నివేదికలో పేర్కొన్నది. 'అందుకు కొనసాగింపుగానే ఇప్పుడు ప్రజా ప్రయోజనాలు, విద్యాభివృద్ధి, ఇతర పర్యావరణహితానికి భిన్నంగా ఆర్థిక ప్రయోజనాల కోసమే ఈ భూముల్ని తాకట్టు పెడుతున్నట్టుగా ఉన్నది. వీటన్నింటినీ పరిగణనలోనికి తీసుకుంటే చెట్ల నరికివేత అనేది సందేహాస్పదంగా అనిపిస్తున్నది. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించే పరిస్థితి లేనందున, వారితో విచారణ అవసరంలేదు. అందుకే దీనిపై ప్రత్యేక ఏజెన్సీ ద్వారా పారదర్శకంగా విచారణ చేయించాల్సిన అవసరమున్నది. సదరు ఏజెన్సీ కేవలం చెట్ల నరికివేత కోణంలోనే కాకుండా ఈ భూములను తాకట్టు పెట్టి మూడో వ్యక్తి చేతికి భూముల యాజమాన్య హక్కులు ఇవ్వడం, అందుకు సంబంధించిన నిర్ణయాలు, వాటి వెనక ఉన్న ఉద్దేశాలపైనా విచారణ చేపట్టాల్సిన అవసరమున్నది. మొత్తం ఈ చెట్ల నరికివేత అనేది కేవలం భూములను చదును చేయడం కోణంలోనే కాకుండా పాలనలో తీవ్ర సంక్షోభం, సంస్థాగత స్వయం ప్రతిపత్తి, పర్యావరణపరంగా జవాబుదారీతనం వంటి కోణాల్లో చూడాలి. మున్ముందు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, ప్రభుత్వ సంస్థల సమగ్రత, సహజవనరుల వారసత్వం దెబ్బతినకుండా ఉండేందుకు పారదర్శకమైన విచారణ చేపట్టాల్సిన అవసరమున్నది. పర్యావరణంగా ఇలాంటి సున్నిత ప్రాంతాలను పరిరక్షించే అంశాల్లో సహజ వనరులను కాపాడాల్సిన బాధ్యతాయుత స్థానంలోని రాష్ట్ర ప్రభుత్వం సందేహాస్పదమైన నిర్ణయాలు తీసుకోవడం ప్రజల్లో ఆందోళనకు దారితీస్తుంది. ఈ చెట్ల నరికివేత అనేది కేవలం అధికార దుర్వినియోగం కిందకే రాదు.. పర్యావరణం, సుస్థిరాభివృద్ధికి గొడ్డలి పెట్టులాంటిది. అందుకే ప్రస్తుత, భావితరాల కోసం బాధ్యతాయుతమైన పాలన, పర్యావరణాన్ని పరిరక్షించడమనేది చాలా ముఖ్యం' అని కమిటీ నివేదికలో స్పష్టంచేసింది.

## లోకం పోకడ




కంగారు పడకు.. నెలజీతం నుంచే అడిగాడు.. నెల ఆదాయం నుంచి వాటా అడగలేదు!

## పర్యావరణ పరిరక్షకుల విజయమిది

### సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నం

### వన్యప్రాణుల పట్ల నం.1 విలన్ రేవంత్

### బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : కంచ గచ్చిబౌలి అటవీ భూముల అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, ఇది వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు పాటు పడే ప్రతి ఒక్కరికీ దక్కిన విజయమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభివర్ణించారు. కంచ గచ్చిబౌలిలో ధ్వంసం చేసిన అడవులను ప్రభుత్వం పునరుద్ధరించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఆయన ఎక్స్ వేదికగా బుధవారం సంతోషం వ్యక్తంచేశారు. వన్యప్రాణులను కాపాడాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, రాష్ట్ర వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్‌కు ఆదేశాలివ్వడం గొప్ప విజయమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులతో హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర పర్యావరణ పరిరక్షణకు గొప్ప ఊతమిచ్చినట్టయిందని అభిప్రాయపడ్డారు. మూగజీవాలు, వృక్షాలు, పర్యావరణానికి అండగా నిలిచిన హెచ్‌సీయూ విద్యార్థులకు, ఆ 400 ఎకరాల కంచ గచ్చిబౌలి అడవిని కాపాడి, హైదరాబాద్ భవిష్యత్తు కోసం నిలబడిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికారిక కమిటీ ఇచ్చిన సిఫార్సులను కూడా బీఆర్‌ఎస్ స్వాగతిస్తున్నదని వెల్లడించారు. గచ్చిబౌలి భూముల తాకట్టు విషయంలో రేవంత్‌రెడ్డి రూ.10 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, అడవులు, వన్యప్రాణుల పట్ల రేవంత్ నంబర్ వన్ విలన్‌గా మారాడని విమర్శించారు. పర్యావరణ విధ్వంసానికి పాల్పడి తప్పించుకోలేరనే కనీస సోయి ఈ ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇకనైనా వస్తుందేమోనని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి పర్యావరణ విధ్వంసాన్ని ఆపాలని హితవు పలికారు.

## సుప్రీం తీర్పు సర్కారుకు చెంపపెట్టు

### కంచ గచ్చిబౌలిపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నం

### అధికారం ఉన్నది కదా అని ఇష్టారీతిన వ్యవహరిస్తే సమాజం, న్యాయవ్యవస్థలు చూస్తూ ఊరుకోవు

### ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందన

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : కంచ గచ్చిబౌలి విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, బాధ్యత గల ప్రభుత్వం, కావాలనే సెలవు దినాల్లో బుల్డోజర్లతో విధ్వంసానికి పాల్పడటంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ సర్కారుకు చెంపపెట్టు అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పర్యావరణ విధ్వంసం ఎంత భయంకరమైనదో సుప్రీంకోర్టులో జరిగిన వాదనలతో ప్రపంచానికి తేటతెల్లమైందని బుధవారం ఎక్స్ వేదికగా తెలిపారు. విధ్వంసం చేసిన వందల ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని నిలదీయడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. అధికారం ఉన్నది కదా అని ఇష్టారీతిన వ్యవహరిస్తే సభ్య సమాజం, న్యాయ వ్యవస్థలు చూస్తూ ఊరుకోబోవని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ముందుకొస్తాయని వివరించారు. విధ్వంసమే విధానంగా రేవంత్‌రెడ్డి నిరంకుశ పాలన సాగుతున్నదని మండిపడ్డారు. హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చి అరాచకం చేశారని, బుల్డోజర్లతో పర్యావరణ హననం చేశారని దుయ్యబట్టారు. తమకు న్యాయస్థానాల మీద ఎంతో గౌరవం ఉన్నదని వెల్లడించారు. అందుకే బాధ్యతగా బీఆర్‌ఎస్ తరఫున సాధికార కమిటీకి నివేదిక ఇచ్చామని చెప్పారు. వృక్షో రక్షతి రక్షితః అని పెద్దలంటే, వృక్షో భక్షతి అన్నట్టుగా తయారైన సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

## రేవంత్ సర్కారుకు షాక్

### బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ భూముల అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌కు చెంపపెట్టు లాంటిందని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ తీర్పు ప్రకృతి ప్రేమికులు, బీఆర్‌ఎస్ విజయమని అభివర్ణించారు. కంచ గచ్చిబౌలి భూమి అటవీ ప్రాంతమే కాదని, అందులో జంతువులు లేవంటూ ఇన్ని రోజులు అందరినీ తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసిన సర్కార్‌కు సుప్రీంతీర్పు దిమ్మదిరిగే షాక్‌లా ఉందని చెప్పారు. విద్యార్థులపై, ప్రశ్నించిన ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నేతలపై కేసులు పెట్టి రాక్షసానందం పొందిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పటికైనా తన విధానాన్ని మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అటు కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ ప్రజల విజయమని బీఆర్‌ఎస్వీ ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు వన్యప్రాణులను, అడవులను కాపాడాలంటూ ఆదేశాలు ఇవ్వడం హర్షించదగిన విషయమని పేర్కొన్నారు. ఈ అంశంపై గల్లీ నుంచి ఢిల్లీ వరకు హెచ్‌సీయూ విద్యార్థులకు అండగా నిలిచిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## స్మితా సబర్వాల్‌కు పోలీసుల నోటీసులు

- హెచ్‌సీయూ అంశంలో వైరలయిన ఫొటోలు షేర్ చేశారని అభియోగాలు
- 'ఎక్స్' వేదికగా ఖండించిన జర్నలిస్ట్, సౌత్‌ఫస్ట్ ఎడిటర్ అనూష రవిసూద్



హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ)/శేరిలింగంపల్లి: తెలంగాణ సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్, రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు తెలంగాణ పోలీసులు నోటీసులు జారీ చేశారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి మార్చి 31న 'హాయ్ హైదరాబాద్' అనే ఎక్స్ హ్యాండిల్ పోస్ట్ చేసిన గిబ్లీ ఫొటోను స్మితాసబర్వాల్ రీపోస్ట్ చేశారు. సేవ్ హైదరాబాద్, సేవ్ హెచ్‌సీయూ బయోడైవర్సిటీ అని పేర్కొన్నారు. ఆ పోస్టులో మష్రూమ్ రాక్ ఎదుట భారీ సంఖ్యలో బుల్డోజర్లు మోహరించగా, బుల్డోజర్లకు ఎదురుగా నెమలి, జింకలు ఉన్నాయి. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఇది ఫేక్ ఫొటో అంటూ అభియోగాలు మోపారు. ఈ మేరకు బీఎన్‌ఎస్ 179 సెక్షన్ కింద పోలీసులు నోటీసులు అందించారు.


### ఐఏఎస్ ఆఫీసర్లకు నోటీసులా?: అనూష రవిసూద్, సౌత్‌ఫస్ట్ ఎడిటర్

ఐఏఎస్ ఆఫీసర్ స్మితాసబర్వాల్‌కు పోలీసులు నోటీసులు ఇవ్వడంపై సౌత్‌ఫస్ట్ ఎడిటర్ అనూష రవిసూద్ 'ఎక్స్' వేదికగా ఖండించారు. హెచ్‌సీయూ అంశంపై గిబ్లీ ఫొటోను రీపోస్ట్ చేసినందుకు ఐఏఎస్ అధికారికి తెలంగాణ పోలీసులు నోటీసులు జారీ చేయడం సరికాదని చెప్పారు. ఏఐతో రూపొందించిన ఫొటోలపై నోటీసులు ఇవ్వడం, కేసు నమోదు చేయడమేంటని ప్రశ్నించారు. వ్యంగ్యంగా కార్టూన్లు వేశారని కార్టూనిస్టులపై కూడా సీఎం రేవంత్‌రెడ్డి కేసులు పెడతారా? అని మండిపడ్డారు.

# కీలకంగా హరీశ్ నివేదిక

**200 పేజీలతో సాధికార కమిటీకి అందజేత • సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో ప్రముఖంగా ప్రస్తావించిన ఎంపవర్డ్ కమిటీ**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టు చేపట్టిన విచారణలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎంపవర్డ్ కమిటీకి సమర్పించిన నివేదిక కీలకంగా మారింది. చెట్లు నరికిన ప్రాంతాన్ని ఎంపవర్డ్ కమిటీ సందర్శించిన సందర్భంగా వారికి హరీశ్‌రావు 200 పేజీల సమగ్ర నివేదిక అందజేశారు. అందులో పలు కీలక అంశాలను పేర్కొన్నారు. వాటన్నింటినీ సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో సీఈసీ ప్రముఖంగా ప్రస్తావించింది. 'వాల్టా చట్టంలోని సెక్షన్ 28(5) ప్రకారం ఒక చెట్టును నరికితే దాని స్థానంలో గాని, పరిసరాల్లో గాని కనీసం రెండు మొక్కలు నాటాలి. మొక్కలు నాటడం సాధ్యం కాకుంటే వాటి నిర్వహణ ఖర్చును సదరు వ్యక్తులు భరించాలి. వాల్టా చట్టం అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు వర్తిస్తుంది. హెచ్‌సీయూ భూములకు కూడా ఈ చట్టం వర్తిస్తుంది. భూగర్భ జలాల పెరుగుదల, అడవుల పరిరక్షణ, వాన నీటి సంరక్షణ తదితర అంశాల్లో వాల్టా చట్టం తెలంగాణలో కీలక పాత్ర పోషిస్తున్నది. 400 ఎకరాల విషయంలో కాంగ్రెస్ సర్కార్ వాల్టా చట్టానికి పూర్తి విరుద్ధంగా వ్యవహరించింది' అని హరీశ్ ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. నివేదిక ఆధారంగా వాల్టా చట్టాన్ని అతిక్రమించినట్టు తేలితే లా సెక్రటరీ వివరణ ఇవ్వాల్సి ఉంటుందని ఎంపవర్డ్ కమిటీ నివేదికలో ప్రస్తావించింది.



### ఏండ్ల తరబడి అన్యాక్రాంతం

హెచ్‌సీయూ భూముల్లో దశాబ్దాలుగా జీవవైవిధ్యం అభివృద్ధి చెందింది. అనేక జాతుల మొక్కలు, జంతువులకు నిలయంగా మారింది. కానీ 50 ఏండ్లుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వాలు వివిధ సంస్థలకు వందలాది ఎకరాలను కట్టబెట్టాయి. రిజిస్ట్రేషన్ చేయకుండా నచ్చినట్టు అన్యాక్రాంతం చేశాయి. నాటి ప్రభుత్వాలు కట్టబెట్టిన సంస్థలన్నీ విద్యకు సంబంధం లేనివే. వర్సిటీ ఏర్పాటు సందర్భంగా 2300 ఎకరాల్లో విద్యా పరమైన అభివృద్ధికి మాత్రమే ఈ భూములను వినియోగించాలని నాడు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ నిబంధనలకు విరుద్ధంగా భూములను ఇతర సంస్థలకు అప్పగించారు. జీవవైవిధ్యానికి కేంద్రమైన ఈ ప్రాంతం చుట్టూ ఐటీ సంస్థలు ఏర్పాటు చేస్తే.. ఉస్మాన్ సాగర్, మీర్ ఆలం ట్యాంకు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుంది. మహానగరానికి స్వచ్ఛమైన మంచినీటిని అందించే ఆ రెండు చెరువులు ఇప్పుడు కాలుష్య కాసారాలుగా మారాయి. 2004లో నాటి ప్రభుత్వం వర్సిటీ భూములను విద్యాపరమైన అభివృద్ధి కోసమే ఐఎంజీ భారత సంస్థకు అప్పగిస్తున్నట్టు ఒప్పందం కుదుర్చుకున్నది. 400 ఎకరాల్లో స్పోర్ట్స్ అకాడమీలను ఏర్పాటు చేసి క్రీడాభివృద్ధికి వినియోగిస్తామని ఎంవోయూలో పేర్కొన్నది. ఐఎంజీ భారతపై కేసు గెలిచామని గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం విద్యతో సంబంధం లేని సంస్థలకు భూములను అప్పగించేందుకు సిద్ధమైంది.. ఆ భూములను టీజీఐఐసీ పూర్తిగా కాంక్రీట్ జంగల్‌గా మార్చేందుకు ప్రణాళిక రచించింది. అదే జరిగితే వందలాది జాతుల మొక్కలు, జంతువులు కనుమరుగవుతాయి. హైదరాబాద్ గ్రీన్ లంగ్స్ స్పేస్‌గా ఉన్న ప్రాంతం కాలుష్యంతో నిండిపోతుంది' అని కేంద్ర సాధికార కమిటీకి ఇచ్చిన నివేదికలో హరీశ్ బృందం కూలంకషంగా పేర్కొన్నది.